# అంకితోత్సవం

సాహితీయజ్ఞం పూర్తయ్యింది.

రాయలవారి పెదాల మీద విజయలాస్యం మెరిసింది.

తపస్సమాధిలోంచి లేచి ఒళ్ళు విరుచుకుంటూ చుట్టూ చూశారు.

చల్లని వెన్నెల జల్లులుగా కురుస్తోంది. ఉద్యానవనంలోని వివిధ పుష్పాలు సువాసనలు వెదజల్లుతున్నాయి. చిరుగాలులు ఆప్యాయంగా ఒడలు నిమురుతున్నాయి.

అంతదాకా తమ ప్రభువు దీక్షకు భగ్నం కలక్కుండా రాణీవాసానికే పరిమితమైన తిరుమలదేవి, చిన్నాదేవి తటాలున సమీపించారు.

బంగారు కలశంతో మధుర పానీయం అందించింది తిరుమలదేవి.

చిందరవందరగా పడివున్న తాళపత్రాలను ఏరి కూర్చసాగింది చిన్నాదేవి.

" కావ్యరచనకు ఉపక్రమిస్తే చాలు ప్రభువులు ఋషులైపోతారు "

తిరుమలదేవి మాటలకు మందహాసం చేశారు శ్రీకృష్ణదేవరాయలు. " నా సృష్టి: కురుతే కావ్యం ! "

చూపుల్తోనే అభినందిస్తూ చూసింది చిన్నాదేవి. " చిన్నమాంబా ! పరిచారికలుండగా మీ కెందుకీ శ్రమ? "

" ప్రభువుల ఆజరామరకీర్తిలో మమ్మల్నీ భాగస్వాములు కానీండి... "

" అవశ్యం. మీరిరువురూ మా నేత్రద్వయం. అప్పాజీ మా బహి: ప్రాణం. మేం ఇంటగెలిచినా రచ్చగెలిచినా మీ ముగ్గురే కారకులు "

"అబ్బో ! ప్రభువుల వారి కల్పనాచమత్కృతి ఇవాళ మా మీదకు మళ్ళిందేమిటో!" నగు మోముతో ఆమె వంక చూస్తూ అన్నారు " తిరుమలాంబా ! మీ ఇద్దరితో కలిసే

పట్టాభిషిక్తమైన సంగతి మరిచారా ఏమి? "

" శ్రీ కృష్ణ జన్మదినాన గద్దెనెక్కిన శ్రీ కృష్ణదేవరాయల ప్రభువులనీ వారి ప్రక్కన ఆశీనులమైన మా భాగ్యాన్నీ  మరువ సాధ్యమా ? అది జరిగి దశాబ్దకాలం గడిచిన సంగతీ మాకు గుర్తుంది."

ఆమెని చూపుల్తోనే అభినందించారు రాయలు.

" సాహిత్య సృష్టితో అలసిన ప్రభువులు సంగీతపు అలల మీద తేలియాడి సేదదీరితే బావుంటుందేమో ! " రాయలు మనస్సెరిగిన చిన్నాదేవి వీణని తెచ్చిస్తూ అంది.

ఆయన మోము పున్నమి సంద్రమయ్యింది.

రాయలు వీణావాదనా నిపుణుడు. విదేశీ యాత్రికులు బహూకరించే వివిధ సంగీత వాయిద్యాలను క్షణాల్లో ఆకళింపుజేసుకుని సప్తరాగరసానందంలో ఓలలాడించగల దిట్ట.

రాయలు వీణను శృతి చేస్తుంటే చిన్నాదేవి కాలికి గజ్జె కట్టుకుంది.

ప్రభువుల భుజం మీద తల ఆన్చి నాట్య సంగీత ఝరీ సంగమ మాధుర్యంలో మునిగి ముగ్ధురాలయ్యింది తిరుమలాంబ .

*  *  *

రాయలు ఆజానబాహుడు గాకపోయినా నిండైన రూపురేఖలు గల ఎత్తరి. నిరంతర కసరత్తు వల్ల లభ్యమైన  దేహదారుఢ్యం. చక్కని శరీర కాంతిఛాయ. ఒత్తైన గిరజాల జుట్టు. స్ఫోటకపు మచ్చలున్నా కళయైన ముఖం. అగ్రహానుగ్రహాలు ఏకకాలంలో వర్షించ గల చక్కని నేత్రాలు. మెలితిరిగిన మీసాలు. నుదుట తిరుచూర్ణ నామం. మెడలో సుందరాభరణాలు. బంగారు వెండి తీగెల జరీ అల్లిన పల్చటి పొరల ధవళ కాంతుల అంగరఖా, పంచె ధరించి తనదైన దర్పంతో హుందాగా ఉంటారు. చూపరుల్ని ఇట్టే ఆకట్టుకునే ఆకర్షణీయమైన రూపం వారిది.

శయనతల్పం మీదకు చేరిన ప్రభువుకి చేతివేళ్ళకు చుట్టుకున్న తమలపాకు చిలకల్ని పోటీపడి మరీ తినిపించారు రాణులిద్దరూ.

" చిన్న  సందేహము ప్రభూ. కావ్యరచనకు మృష్టాన్న భోజనం ప్రియదూతిక తెచ్చిన కర్పూర విడెం హంసతూలికా తల్పం ఆదిగా కావాలని శలవిచ్చారు పెద్దలు పెద్దన కవివర్యులు. మరి వాటి అవసరం లేకుండానే తమరెన్నో సంస్కృత కావ్యాలు రచించారు.

ఇప్పుడో తెలుగు కావ్యమూ వెలయించారు.... "

" ఇది పెద్దనగారు మాత్రమే నివృత్తి చేయగల సందేహమేమో ?! "

రాయలు ముసిముసి నవ్వులకు కృత్రిమ కోపం అభినయిస్తూ నల్లత్రాచులాంటి జడతో సుతారంగా కొట్టింది తిరుమలాంబ.

" చిత్రం అదికాదు సోదరీ. కన్నడ రాజ్య రమా రమణ బిరుదాంకితులు తెలుగులో కావ్యరచన చేయడం విడ్డూరం కాదూ ! "

చిన్నమాంబ పలుకులకు తలపంకిస్తూ అన్నారు " చక్కని మాట. తెలుగు కన్నడములు రెండున్నూ మా అధికార భాషలు. మేం సంస్కృతాంధ్రల్లో ప్రవీణులం. కన్నడ తమిళ భాషల్లోనూ చక్కని ప్రవేశముంది. అయిననూ తెలుగంటే అభిమానం మెండు. మధురమైన వినసొంపైన భాష తెలుగు. దేశ భాషలందు తెలుగు లెస్స ! "

ఆనందం పట్టలేక చప్పట్లు చరిచింది తిరుమలాంబ.

" మా పిచ్చిగానీ కవిసార్వభౌములకు పదములు కొరతా ! ప్రభువుల ఆంధ్రకావ్య వస్తువు గురించీ అందులో పోయిన వినూత్న పోకడల గురించీ తెలుసుకోవాలని ఉత్సుకతగా ఉంది "

చిన్నమాంబ మాటలకు, " కవిరాజులకు అడ్డేముంటుంది ! వారి ఊహలకి రెక్కలు తప్ప ఎల్లలు ఉండవు కదా ! " అంటూ మందహాసం చేసింది తిరుమలాంబ.

" కవియా నిరంకుశ: అయిననూ ప్రభువులం అన్న సంగతి విస్మరించలేదు. మేం వైష్ణవులమైనా శైవ వీరశైవ శాక్తేయ శాఖల్నీ ఆదరించాం. దేవాలయాలనే గాక మసీదులు చర్చీలు సైతం నిర్మించాం. వివిధ మత గురువులకు కనాకాభిషేకాలు చేశాం. ఇక సంగీత సాహిత్య నృత్య శిల్ప కళాకారులకు విజయనగర సామ్రాజ్యం పాదాభివందనం చేస్తుందన్నది ఎల్లరెరిగిన సత్యం ! "

" అయితే అందరికీ తెలిసిన గోదాదేవి కథ ద్వారా ప్రభువులు తమ దృష్టినీ దృక్పథాన్నీ వెల్లడించారను కోవచ్చా?"

"నిస్సందేహంగా. విష్ణుచిత్తుని కథలో కేశిధ్వజుల కథనీ మాలదాసరి వృత్తాంతాన్నీ చేర్చి సమదృష్టి ప్రదర్శించాం. యమునాచార్య ముఖత: రాజధర్మాన్నీ వివరించాం. రాజుకు ప్రజల యోగక్షేమాలే ముఖ్యధర్మమని ఉద్బోధించాం.."

" ఓహో. ఇది పెద్దన గారి కృతేమోనన్న అపప్రథ రాకుండా ముందే జాగ్రత్త వహించారన్న మాట ! " చిన్నగా నవ్వింది చిన్నమాంబ.

" మా సంస్కృతాంధ్ర పాండిత్యం సాహిత్యపోషకత్వం జగద్విదితం. భావి చరిత్రకారులు అంతటి నైచ్యానికి పాల్పడతారనుకోం. అయినను అల్లసాని వారి అల్లిక జిగిబిగి అపూర్వం అనుసరణకసాధ్యం కదా! "

"బాగుగా శలవిచ్చారు. ఆముక్తమాల్యద అని నామమిడటంలో ఔచిత్యమేమిటో!"

" తాను ముడుచుకున్న పూలదండను శ్రీరంగనాథునికి సమర్పిస్తుంది గోదాదేవి. ఆమె ప్రేమ స్వచ్ఛమైంది. అమలినమైంది. భగవంతునికదే ప్రీతికరం. ఆ సంగతి నొక్కి వక్కాణించుటయే మా ఉద్దేశ్యం "

తిరుమలాంబ ఏదో చెప్పబోతోంటే, " ఇంక చాలు దేవీ. రతికేళీసరస సమరానికి సమయమయ్యింది" అన్నారు రాయలు.

సిగ్గుల మొగ్గలయ్యారు దేవేరులు.

* * *

" ప్రభువుల వారి మోములో నేడు వినూత్న కాంతి దర్శనమిస్తోంది. ఏదైనా జైత్రయాత్రకు పథక రచన చేశారా ప్రభూ? ! " మహామంత్రి తిమ్మరుసు సాలోచనగా చూస్తూ అడిగారు.

" లేదు లేదు అప్పాజీ. చేసిన యుద్ధాలు చాలు. సాళువ నరసింహరాయలు మరణ శాసనానుసారం ఉదయగిరి, రాయచూరు, కొండపల్లి తిరిగి జయించి వారికి అసలుసిసలు వారసులమయ్యాం. విజయనగర సామ్రాజ్యాన్ని కనీవినని రీతిలో కటకం వరకూ విస్తరింపజేశాం. ఆదిల్షాని తరిమి తరిమి కొట్టాం. మాకిక రాజ్య విస్తరణకాంక్ష లేదు గాక లేదు. ప్రజలకు సుపరిపాలన అందించుటయే మా ధ్యేయం. వారి మనస్సుల్లో సుస్థిర స్థాన సంపాదనే మా లక్ష్యం. శాంతిక్షేమాలే మా మార్గం ! "

" భేష్ ! ఈ మాట ఈ బాట తమరి పాలనా కాలాన్ని స్వర్ణయుగం చేసి తీరుతుంది ప్రభూ ! "

" అదేమో గాని ఆంధ్ర సాహిత్య చరిత్రలో మాకు స్థిరస్థానం చిరంజీవత్వం సాధించి పెట్టే మహాకార్యం పూర్తిచేశాం. నిన్ననే ఆముక్తమాల్యద కావ్యరచనకు

ముక్తాయింపునిచ్చాం " కళ్ళల్లో వెలుగులు చిందులేస్తోంటే ఆనందోత్సాహాలతో ఊగిపోతూ చెప్పారు రాయలు.

తిమ్మరుసు అమితాశ్చర్యంతో చూశారు. భుజం తట్టి ఆలింగనం చేసుకోవాలనే కాంక్షకు కళ్ళెం వేసి అభినందన పూర్వకంగా చూశారు.

" సామ్రాజ్యభారాన్ని వహిస్తూ మదాలస చరిత్ర, సత్యభామ పరిణయం, జ్ఞాన చింతామణి, సకలకథా సంగ్రహ, రసమంజరి కావ్యాలను సంస్కృతంలో రచించారు. ఇప్పుడేకంగా తెలుగులో కావ్యాన్ని వెలయించడం అమోఘం అపురూపం ప్రభూ ! "

ఆయన నేత్రాల వెంబడి ఆనంద భాష్పాలు జలజల రాలాయి.

" మేం నిమిత్త మాత్రులం అప్పాజీ. రామభద్రుడు పోతన గారి చేత భాగవతం రాయించార్త. మా చేత ఆంధ్ర విష్ణువు రాయించారు... "

సంభ్రమంగా చూశారు అప్పాజీ.

" ముందుగా మీకు చెప్పనందుకు క్షమించండి అప్పాజీ. కళింగ దాడి కెళ్తూ కృష్ణానదీతీరాన గల శ్రీకాకుళంలో విడిదిచేశాం, గుర్తుంది కదా ? ఏకాదశి రోజున ఉపవాసముండి గుడిలో నిద్రించాం. ఆ రోజు రాత్రి స్వప్నంలో శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు శ్రీలక్ష్మీ సమేతంగా దర్శనమిచ్చారు. గోదాకల్యాణాన్ని తెలుగులో రచించమని ఆదేశించారు. తెలుగులోనే ఎందుకని ప్రశ్నించాము. దేశం తెలుగుదేశం గనుక, తాను తెలుగు వల్లభుడు గనుక, తెలుగు చేవ కండ గల భాష గనుక తెలుగులో రచించి శ్రీ వేంకటపతికి అంకితమివ్వమన్నారు. వెంటనే శ్రీకాకుళంలోనే ఆముక్తమాల్యద రచనకు అంకురార్పణ చేశాము. అదిప్పటికి పూర్తయింది "

మరి నిలువలేపోయారు. రాయలు భుజాలు పట్టుకుని కుదిపేశారు తిమ్మరుసు.

" భాగ్యశాలివి రాయలూ. మా శ్రమ మా ఆరాటం మా తపన వృథా కాలేదు. మా ముందు నిలిచి ఉన్నది మేం చేతులడ్డు పెట్టి కాపుగాచిన బాలుడు కాదు. తుళువ వంశ విభుడు. తెలుగుజాతి వీరశౌర్యాల్ని చాటిన ఘనుడు. మూరు రాయర గండ. ఆంధ్రభోజ. ఆర్షధర్మం జగజ్జేయమానం గావించిన శ్రీ కృష్ణ దేవరాయ సార్వభౌముడు... ! "

" అప్పాజీ మమతానురాగామృతాలను దోసిళ్ళ కొద్దీ త్రాగిన అదృష్టశాలులం కూడానూ..."

" అంతా దైవేచ్ఛ ! "

" తిరుమల యాత్రకు ఏర్పాట్లు చేయండి అప్పాజీ. రాణులతో కలిసి వెళ్ళి మా ఆముక్తమాల్యద కావ్యాన్ని తిరువెంగళనాథుడికి అంకితమిస్తాం. ఈ ఉత్సవంలో మీరు కూడా పాలు పంచుకోవాలి. మా అంకితోత్సవ శుభ సందర్భంగా మా బరువుకి సరితూగే ధనాన్ని పేదసాదలకు పండితులకు పంచదలిచాం. దైవం మానుష రూపేణ. మానవసేవ చేసి మాధవుడి కరుణకు పాత్రులవుతాం. అందుకున్నూ ఏర్పాట్లు చేయగలరు "

శిరస్సూపి " విజయనగర సామ్రాజ్యానికి వారసుడ్ని ప్రసాదించమని శ్రీ వేంకటాచలపతిని ప్రార్థిస్తాం" అన్నారు తిమ్మరుసు.

రాయలు కళ్ళల్లో తడిపొర కదిలింది. " అప్పాజీ ! "

సృష్టిలోని ఆత్మీయతంతా ఆ మూడక్షరాల్లో నిబిడీకృతమైవుంది !

* * *

సాహిత్య గోష్ఠి కోసం ప్రత్యేకంగా నిర్మితమైన ' భువన విజయం ' లోకి ప్రవేశించారు కృష్ణదేవరాయలు.

ఆస్థాన అష్టదిగ్గజాలైన అల్లసాని పెద్దన, మాదయగారి మల్లన, తెనాలి రామకృష్ణుడు, ధూర్జటి, పింగళి సూరన, అయ్యలరాజు రామభద్రుడు, రామరాజు భూషణుడు, నంది తిమ్మన ఆశీనులై ఉన్నారు.

ప్రభువుల వారిని చూచి వినమ్రులై లేచి నిలబడ్డారు.

ఆసనాన్నధిరోహించి వారినీ ఆసీనులు కమ్మని సైగ చేశారు రాయలు. అందరి వద్దా ఆముక్తమాల్యద తాళపత్ర ప్రతులు చూచి తలపంకించారు. " మా కావ్యకన్యక గురించి మహాకవుల అభిప్రాయాలు వినగోరుతున్నాం "

సభ నిశ్శబ్దమయ్యింది.

వారి ఉదాశీనత ప్రభువుల వారికి అలక్ష్యంగా అన్పించింది. సర్రున కోపం దూసుకు వచ్చింది.

" మేమున్నూ కాళిదాసు వలె అరసి కేషు కవిత్వ నివేదనం శిరసి మా లిఖ ! మా లిఖ ! మా లిఖ ! అని కోరుకోవాలేమో ! "

కలవరపడ్డారంతా. కాని నోరు తెరవడానికి ధైర్యం చాలలేదెవరికీ.

" ఈ మౌనానికి అర్థం ఒక అభిప్రాయం వ్యక్తపరచగల స్థాయి మా కావ్యానికి

లేదని సభా భావన అని భావించవచ్చా ? " మొఖం ఎర్రబడగా తీవ్రస్వరంతో అన్నారు.

చటుక్కున లేచారు పెద్దన. " ప్రభువులు మన్నించాలి. సభలోని వారమంతా ఘటికులమే అయినా మా నోట మాట రానంతగా కట్టిపడేసింది తమరి కావ్యరాజం. వసుచరిత్ర, శృంగారనైషధం, పారిజాతాపహరణం కావ్యాలకన్నా తలమానికమైంది ప్రభువుల వారి ఆముక్తమాల్యద "

రాయలవారి భుజాలు ఉప్పొంగాయి. వామహస్తం మీసాన్ని మెలి తిప్పింది. కించిత్తు గర్వంగా చూశారు.

" ఓహ్! ఇది ఆంధ్రకవితా పితామహుడు మాకిచ్చిన ప్రశంసాపత్రంగా భావిస్తున్నాం... " పరమానందపడుతూ అన్నారు.

సంభాషణ విన్న తెనాలి రామకృష్ణుల వారి శరీరం ఆసాంతం కుతకుత ఉడికి పోయింది.

" ప్రభువుల వారికి ప్రథమ కోపం అధికమని తెలుసు. అయినసూ రెండు ముక్కలు చెప్పడానికి సాహసిస్తున్నాం. మన్నిస్తారని భావిస్తున్నాం.. "

" నిర్భయంగా సూటిగా చెప్పండి కవివర్యా. శివభక్తులైన రామలింగ కవి వైష్ణవాన్ని స్వీకరించి రామకృష్ణులయ్యారు. మీ నోట వైష్ణవ సిద్ధాంతానికి పెద్దపీట వేసిన మా గ్రంథం గురించి వినాలని ఉత్కంఠగా ఉంది"

" కావ్య విమర్శ చేసేప్పుడు కావ్యకర్త ఎవరన్నది అప్రస్తుతం. ఎవరు రాశారన్నది గాక ఏమి రాశారు ఎలా రాశారన్నదే ప్రస్తుతం. ఆ దృష్ట్యా చూస్తే ఇందులో అసందర్భాలు అధికం. విషయ వివరణా విస్తరణా బాగున్నప్పటికీ అనవసర ప్రసంగాల వల్ల బిగిలేని సామాన్యరచనగా మాకు తోస్తోంది. ప్రభువుల పల్లకీ మోసేవారు మోయవచ్చును గాక !" క్రీగంట పెద్దనని చూస్తూ అన్నాను.

ఉరికి రాబోయిన కోపాన్ని కవి ముందుగానే వేసిన ముందుకాళ్ళ బంధం వల్ల నిగ్రహించుకున్నారు. అసహనంగా చూశారు రాయలు.

" శివభక్తులమైన మమ్ములను తమరి కావ్యం కదిలించింది మహాప్రభో ! " అన్నారు దూర్జటి.

" విష్ణుచిత్తుడి కథ గనుక విష్ణుచిత్తీయం అని నామమిడిన బాగుండెడిది "

పింగళి సూరన సూచించారు.

" నిర్మల భక్తి ప్రేమలకు మలిన మంటదని వారికే శ్రీహరి కరుణాకటాక్ష వీక్షణాలు లభిస్తాయని చెప్పదలిచాం " రాయలు బదులిచ్చారు.

" ఆండాళ్ అనగా గోదాదేవి సౌందర్యాన్ని వసంతవర్ష ఋతువుల్తో పోలుస్తూ ముప్పది పద్యాల్లో వర్ణించడం అత్యద్భుతం ! అనితరసాధ్యం ! ఇది ప్రభువుల వారిని తెలుగుసాహితీ సమరాంగణ సార్వభౌముడ్ని చేసి తీర్తుంది ! " మల్లన వాక్రుచ్చారు.

సభ కరతాళ ధ్వనులతో మార్మోగింది.

రాయలు నఖశిఖపర్యంతం గర్వానందంతో నిండిపోయింది.

' మాకు సాటి లేరు. మేం సార్వభౌములం ! ' అనుకున్నారు.

* * *

కృష్ణదేవరాయలి తిరుమల యాత్ర ఆరంభమైంది.

వారితోబాటు రాణి తిరుమల దేవి, రాణి చిన్నాదేవి, మహామంత్రి తిమ్మరుసు, అశ్వికదళం, పదాతిదళం, సేవకదళం బయల్దేరింది.

శత్రురాజుల్ని ఓడించేక విజయోత్సాహంతో తిరుమల వెళ్ళి వేంకటాచలపతిని దర్శించడం రాయల వారి అలవాటు. అలా ఇప్పటికి అయిదుసార్లు దర్శించారు. ఇది ఆరవసారి.

ఈ యాత్ర ప్రత్యేకత వేరు. కళింగ యుద్ధానంతరం ఆముక్తమాల్యదని రచించేక అంకితోత్సవార్థం వెళ్తున్నారు. మనస్సులో వారసుడ్నిమ్మని అర్థించాలన్న బలీయమైన కోరికా ఉంది.

దారి పొడవునా సామంతులు దండ నాయకులు మాండలికులు జనులు స్వాగతం చెబుతున్నారు. జయ జయ నాదాలు చేస్తున్నారు. చాలామంది ప్రభువుతో బాటు యాత్రలో పాలుపంచుకుంటున్నారు.

" జన ప్రవాహాన్ని చూశారా ప్రభూ. మీ యాత్ర జనంలో కదలిక తీసుకొచ్చింది. భక్తిని తట్టి లేపుతోంది. జనం చేత నీరాజనాలందుకొంటోన్న రాయలు ప్రభువు తిరుమల రాయుని ముందు మోకరిల్లుతున్నారంటే ఆ దేవదేవుడు ఎంత గొప్ప ప్రభువో

అనుకుంటున్నారు..."

రాయలుకి అప్పాజీ మాటలు రుచించలేదు. అసహనంగా చూశారు. " ఆ ప్రభువు కన్నా ఈ ప్రభువు అధికుడని భావిస్తున్నారేమో ! ఆ ప్రభువుకి సైతం రత్నభూషణాలు, అగ్రహారాలు దానమిచ్చిన వారం కదా ! "

ఉలిక్కిపడి చూశారు తిమ్మరుసు. ఆయనలో ఏదో మార్పు లీలగా గోచరించింది. విస్మితులై చూశార్తప్ప తర్కించలేదు.

సీమలో విడిది చేశారు. జనం బాగోగులు కనుక్కొంటోంటే రైతులు ముందుకొచ్చి చేతులు జోడించారు. నీటి వసతి లేనందున పంటలు మాడిపోతున్నాయని రాయలుకి మొరబెట్టుకున్నారు.

వెంటనే కార్యనిర్వాహకుల్ని పిలిచి చెరువులు తవ్వేందుకు ఆజ్ఞ జారీ చేశారు.

బయటి సంభాషణని గుడారం లోపల వున్న రాణులిద్దరూ విన్నారు.

" మన ప్రభువుకి కాపులన్నా పాలికాపులన్నా ప్రత్యేకాభిమానం. వారి తల్లి నాగులాదేవి కడప ప్రాంతపు కాపు పడుచు కదా ! " నవ్వింది చిన్నమాంబ.

" తల్లిదండ్రులంటే వారికెంతో ప్రేమ. మరెంతో గౌరవం. పట్టాభిషిక్తులవుతూనే విజయనగరం ప్రక్కనే తల్లి పేరిట నాగులాపురం నిర్మించారు. వారిద్దరి జ్ఞాపకార్థం తిరుమలేశునికి ఐదు గ్రామాలు దానమిచ్చారు."

వారి మాటలు రాయలు విన్నారు.

" పైరుల్నీ పంటల్నీ కాపుగాచే రైతులంటే మాకు ప్రత్యేక అభిమానం గౌరవం. భూమి పచ్చగా ఉండాలి. రైతు చల్లగా ఉండాలి. అప్పుడే రాజ్యం సుభిక్షంగా ఉంటుంది. వాటిని అశ్రద్ధ చేస్తే మిగిలేవి కరువుకాటకాలే. విన్పించేవి ఆకలి కేకలే. రాజు మొదలు సామాన్యుడి వరకూ ప్రతివారికీ మొదట కావాల్సింది భుక్తి. ఆ తర్వాతే రక్తి భక్తి ముక్తి."

ప్రభువు మాటలకు తలూంచుకున్నారు రాణులిద్దరూ.

" రాయలచంద్రుడుదయించినా కలువదేవీలు వికసించకపోవడం విడ్డూరమే సుమా ! "

కిలకిలా నవ్వుతూ చుట్టేశారు దేవేరులు.

తిరుమల కొండ దగ్గర అశ్వరథాలు దిగి పల్లకీ లెక్కారు రాయలూ, రాణులూ.

తిమ్మరుసు రక్షణదళం పరివార జనం కాలినడకన అనుసరించారు.

' ఒహోం ఒహోం హో ' అంటూ ఉత్సాహంగా పల్లకీలు మోస్తూ కొండ ఎక్కుతున్నారు బోయీలు.

కొండపైకి వేళ్ళే 'దారి' దారీ తెన్నూ లేకుండా ఉంది. ఎత్తులు పల్లాలు రాళ్ళు రప్పలు ముళ్ళు తీగలు కొండలు లోయలు... కఠినంగా వుంది. కంటకంగా వుంది. దుర్గమంగానూ ఉంది.

బోయీలు బలిష్ఠులే అయినా పల్లకీ మోస్తూ ఎక్కడానికి నానా అవస్థ పడుతున్నారు. అడుగులు తడబడకుండా జాగ్రత్త పడుతున్నారు. శక్తిని కూడదీసుకుంటూ ఒగురుస్తూనే మోస్తున్నారు. పైపైకి సాగిపోతున్నారు.

సప్తగిరుల సౌందర్యాన్ని చూస్తూ అలౌకికానందాన్ని పొందుతున్నారు రాయలు.

ఉరుకుతోన్న లేళ్ళు దూకుతోన్న సెలయేళ్ళు కిచకిచమంటోన్న మర్కటాలు పరుగులు తీస్తోన్న జంతువులు రెక్కలు టపటప లాడిస్తోన్న పక్షులు – కనువిందు చేస్తున్నాయి. ఔషధ మొక్కల మీంచి వీస్తోన్న గాలి మనశ్శరీరాల్ని ఆహ్లాదపరుస్తోంది.

ఉన్నట్టుండి పులి గాండ్రింపు విన్పించింది.

ఎక్కడి వారక్కడే నిలిచిపోయారు.

సెంచులు ముందుకొచ్చి డప్పులు మ్రోగించారు. కొమ్ము బూరలు ఊదారు. జంతువులన్నీ కకావికలై లోలోపలికి పారిపోయాయి.

యాత్ర మళ్ళీ మొదలైంది.

చలివేంద్రం దగ్గర ఆగి సేదదీరేక ఉత్సాహంగా కదిలారు.

కొండ దగ్గరి కొచ్చేవరకూ ' మహారాజుకీ జై ' అన్న జనం కొండెక్కుతూ ' గోవింద ' నామ జపం చెయ్యసాగారు.

దాంతో రాయల వారికెంతో విసుగ్గా అసహనంగా ఉంది. నుదురు చిట్లిస్తూ బయటికి చూస్తోంటే ఒక చెట్టుక్రింద పండు ముసలివగ్గు కన్పించింది. ఆసక్తిగా చూశారు. ఆమె చేతుల్నిండా అల్ల నేరేడు పండ్లు. సగం సగం కొరుకుతోంది. తింటోందో రుచి చూస్తోందో మరి !

పెనుగొండలో గడచిన బాల్యం, ఆనాటి ఆటలు పాటలు కోతి కొమ్మచ్చులు రకరకాల కాయల, పండ్ల రుచులు గుర్తొచ్చాయి.

నోరూరింది.

తను ప్రభువు అని గుర్తొచ్చి నిగ్రహించుకున్నారు. చూపులు మాత్రం మళ్ళించుకోలేక పోయారు.

రాయలు మనస్సెరిగినట్టు ఆ అవ్వ పరుగు నొచ్చింది. చేతిలోని పళ్ళని తీసుకోమంటూ ఆయన ముందుకు జాపింది. పండ్ల వంక చూశారు. అన్నీ కొరికినవే.

ఒకనాడు గజారూఢులై నగర సందర్శన చేస్తోంటే పెద్దన కవి ఎదురయ్యారు. చేయి అందిచ్చి ఆయన్ని గజం పైకి ఎక్కించుకున్నారు. అలాటితను పల్లకీ మీద ఊరేగుతూ వెళ్తోంటే చేయి చాచి మరీ అందిస్తోందీమె. తను వంగి చేయి కిందపెట్టి దేహి అంటూ అందుకోవాలిట !

అవైనా ఎంగిలి పండ్లు ! ఒక సార్వభౌముడికి అదియూ జనమూ సేవకులూ చూస్తూండగా ఇవ్వజూస్తోందీ ముసిల్ది ! ఎంత కండకావరం !

ఒళ్ళు తెలీని కోపం తన్నుకురాగా ఉగ్రంగా చూశారు. " ఫో " గర్జించారు. " తోసి పారేయండవతలికి..."

అవ్వ భయపడిపోయింది. వణకిపోతూ దూరంగా జరిగింది.

ఏం జరిగిందో అర్థంకాలేదు పల్లకి వెన్నంటి వున్న తిమ్మరుసుకి. రాయలు వంక చిత్రంగా సంశయంగా చూశారు.

కొంచెం ముందుకెళ్ళేక మనస్సాగక వెనుదిరిగి చూశారు రాయలు.

అవ్వ ఆయన్నే చూస్తోంది. ఆ చూపుల్నిండా మూర్తీభవించిన వాత్సల్యం. కన్నతల్లి గుర్తొచ్చింది. కలవరపడ్డారు. ఎదలో అలజడి కెరటం ఉవ్వెత్తున లేచిపడింది.

తనని తాను సంబాళించుకోడానికి చాలా సమయమే పట్టింది.

నిట్టూర్చి ముందు మార్గం వంక చూసిన వారల్లా తుళ్ళిపడ్డారు.

అవ్వ తమకంటే ముందెళ్తోంది. చకచకా కొండ ఎక్కేస్తోంది. ఇదెలా సాధ్యం? !

కళ్ళు నులుపుకుని చూశారు. ' ఔరా ' అన్పించింది.

పల్లకీ ఆపించి అప్పాజీని పిలిచారు.

" అప్పాజీ ! అటు చూడండి. ఆ వృద్ధురాలు అతిసామాన్యురాలు మనకంటే వేగంగా కొండెక్కుతోంది. ఎంత చిత్రం ! "

కళ్ళు చించుకుని చూశారు తిమ్మరుసు. ఎవరూ కన్పించలేదు. చిన్నగా నవ్వారు. " అజేయ గజతురగ కాల్బలంకల చక్రవర్తి కన్నా ముందుగా ఎవరెళ్ళ గలరు ? తమరేదో చిత్తభ్రమకు లోనయినట్టున్నారు ప్రభూ !"

పెదవి కొరుక్కున్నారు రాయలు. అపనమ్మకంగా చూస్తూ! " అలాగంటారా. అరివీర భయంకరులమైన మాకిది నిజంగా చిత్రానుభూతే ! " అన్నారు.

" చిత్తం కన్నా చిత్రమైన ప్రవృత్తి కలది వేరేదీ లేదని ప్రభువులకు తెలియంది కాదు "

మౌనంగా ఉండి పోయారు రాయలు.

పల్లకి నిలిచింది. కనుబొమలు ముడి వేసి చూశారు. తిమ్మరుసు ముందు కొచ్చారు. " మోకాళ్ళ పర్వతం... పల్లకి మోస్తూ అధిరోహించడం కష్టం. బోయీలు చెమటలు కక్కుతున్నారు ప్రభూ.... "

హుంకరిస్తూ చూశారు. " వారిని మార్చండి "

బోయీలు మారారు. యాత్ర కొనసాగింది.

చీకటి పడుతూండగా కొండపైకి చేరుకుంది బృందం.

ఆలయంలోని ధార్మిక కార్యక్రమాలు పర్యవేక్షించే అనుసంధానం తిరువేంకట జీయరు శిష్యుల్తో సహా వచ్చి ఆహ్వానం పలికారు.

" సప్త గిరీశుడ్ని ఏడుసార్లు దర్శించాలనుకున్నాం. ఇది ఆరవసారి " అన్నారు రాయలు.

" ప్రభువుల వారు మరెన్నో మార్లు స్వామి వారిని దర్శించుకుని తరించాలి. కొండంత దేవుడికి కొండంత పత్రినీ సమర్పించిన భక్తాగ్రేసరులు "

" కోనేటి రాయుడి సంకల్పం ఎలావుందో ! "

" మ్లేచ్ఛుల దాడులతో పతనమైపోతున్న భక్తి భావానికి అఖండ ఊపిరిపోసిన మహా ప్రభువులు మా ప్రభువులు. తిరుమల గుడిలోనే గాక కంచి కాళహస్తి శ్రీశైలం సింహాచలం ఆదిగా ఎన్నెన్నో దేవాలయాల్లో విమాన గోపురాలు మండపాలు నిర్మించారు. అంతేగాక వజ్ర వైఢూర్యాలు పొదిగిన బంగారు కిరీటం బంగారు వెండి ఆభరణాలు బంగారు పాత్రలు పచ్చల హారాలు వెండి హారతి పళ్ళాలు వేలకొలదీ వరహాలు స్వామికి

బహూకరించారు. స్వామివారి నిత్య సేవలకు ఉత్సవాలకు కైంకర్యాలకు గాను ఎన్నో గ్రామాలను దానమిచ్చి శాశ్వత ఏర్పాట్లు చేశారు. ప్రభువుల వారి దాన వివరాలన్నీ శిలాఫలకాల మీద చెక్కించి ఆనందనిలయంలో ఉంచడం జరిగింది "

పరమానందపడ్డారు రాయలు.

మర్నాటి ఉదయమే పత్నులతో కలిసి స్వామి పుష్కరిణిలో స్నానమాచరించారు.

గోపురం దగ్గర్నుంచే పూర్ణకుంభంతో వేదమంత్రాలతో స్వాగతం పలికారు అర్చకులు. స్వర్ణకాంతులతో వెలుగొందుతోన్న ప్రాకారాన్ని దాటి ఆనంద నిలయంలోని స్వామి సన్నిధి కేగారు రాయలు.

అర్చకులు వివిధ సేవలు జరిపిస్తోంటే అముక్తమాల్యద తాళపత్రప్రతి, అమూల్యాభరణాలు ఉంచిన బంగారు పళ్ళెం చేత బట్టి తిరువెంగళనాథుని ఎదుట నిలబడ్డారు రాయలు.

స్వామివారి దివ్యమంగళ రూపం చూసి పులకించి పోయారు.

ధగధగ మెరుస్తోన్న కిరీటం, తిరుమణి, కుండలాలు, శంఖు చక్రాలు, అభయమిస్తోన్న వరదహస్తం, కాంతులీనుతోన్న ముఖ వర్చస్సు. పెదాలపై విరిసీవిరియని చిరునగవు, కళ్ళల్లో అపూర్వ వాత్సల్యం....!

ఏదో గుర్తొచ్చి కలవరపడ్డారు. గుండె గుబ గుబ లాడింది. క్షణకాలం నివ్వెరబోయి చూశారు. పళ్ళెం రాణికిచ్చి చిన్నగా కంపిస్తూ చేతులు జోడించారు. మనస్సందడి ఆగింది. ఏకాగ్రత కుదిరింది.

" శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు ఆనతి మేరకు ఈ ఆముక్తమాల్యద కావ్యాన్ని రచించాము. దీన్ని మా వేల్పైన మీకు అంకితమిస్తున్నాము. స్వీకరించి మాకు పుత్రభిక్ష ప్రసాదించు ప్రభూ.... "

కనులు మూసుకుని ప్రార్థించారు. పిమ్మట పళ్ళెం అందుకుని స్వామి పాదాలచెంత పుంచడానికి వంగారు. అదిరిపడ్డారు. తల విదిలించి చూశారు.

స్వామి పాదాల దగ్గర సగం కొరికిన నేరేడు పండ్లు ! కాగడాలు మరియు కర్పూర దీపాల కాంతిలో స్పష్టంగా కన్పించాయి !.

ముసలివగ్గు చూపులు గుర్తొచ్చాయి. స్వామి కళ్ళల్లోకి చూశారు. ఒళ్ళు

జలదరించింది. మరుక్షణం స్వామి పాదాల మీద సాష్టాంగ పడిపోయారు.

"క్షమించు ప్రభూ. మా అపరాధాన్ని మన్నించు. విశుద్ధ ప్రేమకు లొంగుతావని రాశాము గాని ఆచరించ లేకపోయాము స్వామీ. నువ్వు భక్తవత్సలుడివి. శబరి ఎంగిలి పండ్లలో కుచేలుడి అటుకుల్లో స్వచ్ఛమైన నిర్మలమైన భక్తిని చూసిన వాడివి. గోదా ధరించి వేసిన మాలని ఆనందంగా స్వీకరించిన మహాప్రభో పాహిమాం. త్వమేవ శరణం మమ...!"

రాయలు ప్రవర్తనకి అచ్చెరువందుతూనే తిరుమలదేవి, చిన్నాదేవి సాష్టాంగ నమస్కారం చేశారు.

పుటం పెట్టిన పుత్తడిలా ఉండి పులి కడిగిన ముత్యంలా ప్రకాశిస్తోన్న కృష్ణదేవరాయల్ని చూసేసరికి తిమ్మరుసులోని పుత్రవాత్సల్యం పొంగిపొరలింది,

"రాయలూ ! సామ్రాజ్యం అశాశ్వతం. యశస్సు అజరామరం. ఆముక్తమాల్యదనే కాదు అహం అసూయ గర్వం పొగరు మోహం వ్యామోహం ఏమీ అంటని నిష్కళంక నిర్మల భక్తిని తిరుమల ప్రభువుకి అంకితం ఇచ్చారు. కారణ జన్ములు గనుకే ఆంధ్ర విష్ణువు మీచేత ఆ కావ్యరచన చేయించారు. స్వామి కళ్ళెదుట మహాద్వారాని కానుకుని నిలబడిన మీరూ మీ రాణులూ ధన్యులు. స్వామి కరుణాదృక్కులకు పాత్రమైన మీ జన్మలు చరితార్థం. మనందరి ప్రభువైన శ్రీ వేంకటేశుని వాత్సల్యం సదా మీ మీద ప్రసరించే యోగం మీకు దక్కాలని ప్రార్థిస్తున్నాను. ఈ ప్రభువుకు పుత్రోదయం కావాలని ఆ మహా ప్రభువును అర్థిస్తున్నాను"

ఆయన వాక్కులు సత్యం పున: సత్యం కావాలంటూ ఆనందనిలయంలోని జేగంటలు గణగణమని మ్రోగాయి.!

(ప్రజాదైరీ మానవపత్రిక ఫిబ్రవరి 2012)